క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ ఆలయ ప్రతిష్ట



ఆలయ ప్రతిష్టలో మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

మందస: గౌడగురంటి గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. అధికసంఖ్యలో భక్తులు స్వామి వారి ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీపీ డొక్కరి దానయ్య, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దల్లి జానకీరావు, సర్పంచ్ చింతాడ గణపతి, కిశోర్ తదితర నాయకులు హాజయ్యారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో థమన్ తనీష్‌కు 30వ ర్యాంకు



థమన్ తనీష్

కాశీబుగ్గ: సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సీపాన థమన్ తనీష్ ఆలిండియా స్థాయిలో 30వ ర్యాంకు సాధించాడు. 300 మార్కులు గాను 281 సాధించి ప్రతిభకనబర్చాడు. విద్యార్థి తండ్రి రాంబాబు పలాస ఎస్‌బీఐలో మేనేజర్‌గా పని చేస్తుండగా తల్లి వనిత గృహిణి. కుమారుడికి మెరుగైన ర్యాంకు రావడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

బాలల సంరక్షణపై అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ సిబ్బంది

కాశీబుగ్గ: బాలల సంరక్షణపై అందరూ దృష్టి సారించాలని జీఆర్పీ సిబ్బంది అన్నారు. పలాస రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఏఎస్సై చక్రధర్, హెచ్‌సీ సోమేశ్వరరావు సమక్షంలో రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ బాలసరస్వతి ఆధ్వర్యంలో రైలు ప్రయాణికులకు 1098 సేవలు, బాల కార్మికులు, పిల్లల రక్షణపై శనివారం అవగాహన కల్పించారు. అలాగే ప్రయాణికులు రైలు ఎక్కేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

పారదర్శకంగా మహిళల రుణ ప్రణాళిక



మాట్లాడుతున్న డీపీఎం శ్రీధర్

మందస: మహిళ సంఘాల వార్షిక రుణ ప్రణాళిక పక్కాగా, పారదర్శకంగా ఉండాలని జిల్లా ఉన్నతి డీపీఎం జి.శ్రీధర్ అన్నారు. స్థానిక అమ్మవారి గుడి ఆవరణలో వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు ఆధ్వర్యంలో మహిళ సంఘాల సభ్యులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూక్ష్మ రుణ ప్రణాళికను పరిశీలిస్తూ మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేసినప్పుడు సభ్యుల బయోమెట్రిక్‌ను కూడా తీసుకోవాలని సూచించారు. వీవోఏలు నీరజ, శారద, నాగమణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు బాలకృష్ణ, తారక్ మోహన్ పాల్గొన్నారు.

వంశధార కాలువలో పూడికతీత పనులు ప్రారంభం



గుర్రాడగెడ్డ వద్ద కాలువలో పూడికతీత పనులు జరుగుతున్న దృశ్యం

పలాస: పలాస మండలంలోని వంశధార ఎడమ కాలువలో పూడికతీత పనులు శనివారం ప్రారంభమయ్యాయి. లక్ష్మీపురం గ్రామం వద్ద గుర్రాల గెడ్డలో పూడిక తీత పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నీటి సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ.. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందుగానే సాగు నీరు అందివ్వడానికి ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేస్తున్నారని చెప్పారు. కాలువల్లో పూడిక తీత పనులు, నీటి వనురుల అభివృద్ధికి రూ. కోటి నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో వంశధార ప్రధాన కాలువతో పాటు పిల్లకాలువల అభివృద్ధికి రూ.85 లక్షలు వెచ్చిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, దువ్వాడ సంతోష్‌రామ్‌నాయుడు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు గొనప నిరంజన్, లక్ష్మీపురం నీటి సంఘం అధ్యక్షుడు శిష్టు మురళి, దాసరి దాశరధి, వరిశ తారకేశ్వరరావు, వంశధార పలాస ఏఈలు పాల్గొన్నారు.

ఊగుతున్న వంతెనలు!

- శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే కరువు
- భయం భయంగా ప్రయాణం



టెక్కలి-తెంబూర్ రోడ్డులో గంగాధరపేట వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెన

టెక్కలి రూరల్: టెక్కలి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊగుతున్న వంతెనలపై నుంచి వెళ్లేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు. నేడో, రేపో కూలిపోయే స్థితిలో వంతెనలు ఉండటంతో వాటిపై ప్రయాణించాలంటే వణుకుపోతున్నారు. ముఖ్యంగా టెక్కలి నుంచి తెంబూర్ రోడ్డుకి వెళ్లే మార్గంలో గంగాధరపేట గ్రామ సమీపంలో ఉన్న వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్‌లు విరిగిపోవడంతో వాహనదారులు ఆ వంతెన పైనుంచి వెళ్లాలంటే భయపడుతున్నారు. అలాగే చింతలగార సమీపంలో వంశధార కాలువపై ఉన్న వంతెన పూర్తిగా మరమ్మతులకు గురైంది. దీంతో టెక్కలి నుంచి చింతలగార, కొత్తపేట, భగవాన్‌పురం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ఈ వంతెన మీదుగా వెళ్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. అలాగే బన్నువాడ పంచాయతీ పరిధి పిఠాపురం సమీపంలో ఉన్న వంతెన సైతం పూర్తిగా మరమ్మతులకు గురైంది. వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ విరిగిపోవడంతో నిత్యం ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు తప్పితే శాశ్వత నిర్మాణాలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైన జరగరాని ప్రమాదం జరిగితేగాని అధికారులు స్పందించారా అని స్థానికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న వంతెనలను తొలగించి దానిస్థానంలో కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు.



చింతగార సమీపంలో వంశధార కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెన



పిఠాపురం సమీపంలో రైలింగ్ విరిగిపోయి కూలిపోయే స్థితిలో ఉన్న వంతెన

ఘనంగా వైశాఖ హోమం



కవిటి మండలంలోని బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధర పెరుమాళ్ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం శనివారం వైశాఖహోమాన్ని ఒడియా పురోహితులు నిరంజన్‌పాఢి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఏటా వైశాఖ మాసం మూడో శనివారం ఈ ఆలయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలతో రైతులంతా ఆరోగ్యంగా.. ఆనందంగా ఉండాలని కోరుతూ హోమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. హోమం పూజల్లో ప్రభుత్వ విప్ బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు. – కవిటి

యోగా శిక్షణ ప్రారంభం



యోగా ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. పలాస డివిజన్‌కి యోగ ట్రైనర్‌గా ప్రభుత్వ ఉపాధ్యాయులు చెల్లూరు పద్మలోచనను ప్రభుత్వ ఎంపిక చేసింది. ఆమె పర్యవేక్షణలో పలాస రెవెన్యూ డివిజినల్ అధికారి జి.వెంకటేష్ సమక్షంలో రెవెన్యూ ఉద్యోగులకు శనివారం యోగాపై అవగాహన కల్పించారు. – కాశీబుగ్గ

రక్తపోటుపై అవగాహన



అధిక రక్తపోటు నుంచి బయట పడేందుకు ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు శారీరక వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇ.వెంకటరావు అన్నారు. అధిక రక్తపోటుపై అవగాహన సదస్సును వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం నిర్వహిచారు. గుండెను పదిలంగా ఉంచుకునేందుకు పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు వాహినీ ప్రియాంక, వినయ్‌కుమార్, ఎన్‌సీడీ- ఎఫ్ఎల్‌సీ అప్పారావు, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ అప్పలనాయుడు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని మెయిన్ రోడ్ వైపు ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని మున్సిపల్ అధికారులకు పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పాఠశాల ప్రహరీని ఆనుకొని జరుగుతున్న అక్రమ నిర్మాణం (ఆటోస్టాండ్)పై శనివారం పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో సుమారు 1200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అక్రమ నిర్మాణం చేయడం వల్ల మెయిన్‌రోడ్డు గుండా పాఠశాలకు విద్యార్థులు వచ్చేటప్పుడు ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేశారు. నిర్మాణం జరుగుతున్న ప్రదేశం వద్ద బాలికల మరుగుదొడ్లు ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు.



ప్రహరీని ఆనుకొని జరుగుతున్న అక్రమ నిర్మాణం

3న మండల సర్వసభ్య సమావేశం

పలాస: పలాస మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జూన్ మూడో తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వసంతకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



ట్రోఫీ, నగదు బహుమతితో విజేతలు

కాశీబుగ్గ: ప్రతిఒక్కరూ క్రీడలు, వ్యాయామాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధి సూదికొండలో వారం రోజులుగా జరుగుతున్న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఫైనల్‌లో రాజు, సారథి జట్లు తలపడగా రాజు టీం విన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ. 6 వేలు, రన్నర్ జట్టుకు రూ. 4 వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీలను అందజేశారు.

నాయకుల పరామర్శ



కవిటి: తివ్వయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: లండారిపుట్టుగ పంచాయితీ కొండిపుట్టుగకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నర్తు తివ్వయ్య ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించారు.

- టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పరామర్శించారు. యలమంచిలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కవిటి రామరాజు ఇటీవల ప్రమాదానికి గురి కావడంతో ఆయా కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన కవిటి ఆనందరావు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, చలమయ్యపేటకు చెందిన చెల్లూరు మల్లేష్, అంగ అప్పన్న మృతి చెందడంతో ఆయా కుటుంబాలను తిలక్ పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, మండల కన్వీనర్ ఎస్.హేమ సుందర్‌రాజు, నాయకులు ఎన్.సత్యరాజు, ఎస్.వినోద్, హెచ్.గోవింద్, బి.వెంకటరమణ, కె.సంజీవ్, అంగ గున్నయ్య, శివారెడ్డి, కె.లచ్చన్న, పి.మోహన్ ఉన్నారు.
- టెక్కలి: టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి పలువురిని పరామర్శించారు. శాసనాంలో హేమసుందర్ తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, టెక్కలిలో వార్డు సభ్యుడు కింతలి తిరుమల కుమార్ తండ్రి చనిపోవడంతో అతని కుటుంబాన్ని, జిల్లా కేంద్రంలో సూర్యప్రకాశ్ కుటుంబాన్ని వాణి పరామర్శించారు. అలాగే టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పలువురిని పరామర్శించి ఓదార్చారు. ఈమెతో పాటు సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, బి.రాకేష్, ఎస్.అప్పలస్వామి, నాయకులు ఆట్ల రాహుల్, పొందర శ్రీనివాస్ ఉన్నారు.



టెక్కలి: యలమంచిలిలో గాయపడిన రామరాజును పరామర్శిస్తున్న తిలక్ తదితరులు



టెక్కలి: శాసనాంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దువ్వాడ వాణి, నాయకులు

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



కొంకి జగం (ఫైల్)

వజ్రపుకొత్తూరు: కొమరల్తాడ మాజీ సర్పంచ్ కొంకి జగం శనివారం మృతి చెందారు. ఈయన గ్రామ సర్పంచ్‌గా, గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షునిగా పని చేశారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సారథ్యంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారు. రెండేళ్లుగా ఆరోగ్యం క్షీణించడంతో లివర్ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్నారు. ఇంటి వద్దే చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడంతో మృతి చెందారు. ఈయన మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు. స్థానిక సర్పంచ్ చింత రాజు, మాజీ సర్పంచ్‌లు దుర్రి నారాయణస్వామి, పరిసర గ్రామాల సర్పంచ్‌లు, మండల వైఎస్సార్ సీపీ నేతలు జగం కుటుంబాన్ని ఓదార్చారు.

ఊపిరి పోసిన వర్షం..

- భారీ వర్షంతో ఉద్దానం రైతుకు మేలు
- కొబ్బరి, మొగలి తోటలకు, ఊరట



వర్షంతో తడిసిన కొబ్బరి తోట

ఇచ్ఛాపురం రూరల్: ఎండలు తీవ్రంగా ఉండే మే నెలలో వర్షాలంటే రైతుల కళ్లలో ఆనందమే. అందునా ఏడాది పాటు సరైన వర్షాలు లేక ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి తోటలు ఎండి పోతున్న తరుణంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. ఉద్దానం కొబ్బరి రైతులను ప్రభుత్వం కరుణించక పోయినా ప్రకృతి వరమిచ్చింది. అలాగే సముద్ర తీర ప్రాంతంలో మొగలి పంటపై ఆధారపడిన కుటుంబాలకు ఈ వర్షం సంతోషాన్నిచ్చింది.

ఎండిపోయిన కొబ్బరి తోటలు..

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో 32 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగవుతున్నాయి. ఏడాది కాలంగా సరైన వర్షాలు లేకపోవడం, ఈ ఏడాది మార్చి నెల నుంచే ఎండలు తీవ్రంగా ఉండటంతో పాటు తెగుళ్ల సోకడంతో కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయి. కొబ్బరి కాయ సైజు తగ్గి పిక్కకాయగా మారడం, సరైన దిగుబడి లేకపోవడంతో రైతుకు గడ్డు కాలంగా మారింది. అదే విధంగా ఎండల ధాటికి నీరు లేక ఏడాది వయసున్న కొబ్బరి మొక్కలు సైతం చనిపోయాయి. వేల ఏకరాల్లో సాగవుతుండగా, వందల ఎకరాలకు ఈ ప్రభావం ఇబ్బందిగా మారిందని, ఏడాది కాలంలో లక్షల రూపాయల్లో నష్టాన్ని చవిచూసినట్లు ఉద్దానం రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. నైరుతి రుతుపవనాలు వచ్చే వరకూ అడపా, దడపా వర్షాలకు కురిస్తే కొబ్బరి పంటకు బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



డొంకూరు తీరంలో మొగలి డొంకలు

వికసించిన మొగలి రైతుల మోము..

ఇచ్ఛాపురం మండలం నుంచి వజ్రపుకొత్తూరు మండలం వరకు సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో మొగలి తోటలు సాగవుతున్నాయి. సముద్ర తీర ప్రాంతంలో ఉండే రైతులు కేవలం మొగలి తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏడాది నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో మొగలి తోటల సాగు తగ్గింది. మొగలి చెట్టు ఎండిపోవడం, పూల సైజు తగ్గిపోవడంతో రైతులు నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఒకొక్క మొగలిపూవు రూ.35 వరకు ధర పలుకుతుండగా వర్షాలు లేకపోవడంతో దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచి వర్షాలు కురిస్తే ఒక్కో మొగలి చెట్టు ఏడాదిలో వెయ్యి నుంచి పదిహేను వందల వరకు పూలు ఇస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం తమకు అనుకూలంగా ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం మేలు చేసింది



ఎండలు తీవ్రంగా ఉన్న ఈ నెలలో ఆకాల వర్షం కొబ్బరి, మొగలి తోటల రైతులకు చాలా ఉపయోగపడింది. ఎండి పోతున్న పంటపై పడిన వర్షం సంజీవిగా మారిందనే చెప్పవచ్చు. నైరుతి రుతుపవనాలు వచ్చే వరకు అడపా దడపా వర్షాలు కురిస్తే ఉద్దానం రైతుకు ప్రకృతి మరింత మేలు చేసేదిగా ఉంటుంది.

– మాసుపత్రి వీరాస్వామిరెడ్డి, రైతు, సన్యాసిపుట్టుగ

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



దత్తత అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు

టెక్కలి: ప్రతిపల్లెను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సారా తరలిస్తూ పట్టుబడిన కేసులో అరెస్టు కానివారిని తక్షణమే అరెస్టు చేయాలని, అరెస్టయిన వారిని తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయాలని సూచించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం 2.0లో భాగంగా నాటుసారా గ్రామాలను సారా రహిత గ్రామాలుగా మార్చేందుకు గ్రామ దత్తత అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. బైండోవర్ అయిన ముద్దాయిలు అతిక్రమిస్తే వారి నుంచి రూ. రెండు లక్షలు అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. సారా తయారీకి బెల్లం సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు., సారా తయారీదారులు పట్టుబడితే వారికి ఎక్కడ నుంచి బెల్లం సరఫరా అయ్యిందో తెలుసుకొని వారిని కూడా అరెస్టు చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఏఈఎస్ గోపాలక్రిష్ణ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



శంకరరావును సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వవార్డు పురుషోత్తపురం గ్రామంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. పోటీలను జాతీయస్థాయి క్రీడాకారుడు, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి కడమట శంకరరావు ప్రారంభించారు. శివక్రిష్ణకాళీ హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులు జరగనున్న పోటీల్లో 18 జట్లు తలపడుతున్నాయి. ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్రీడాకారుడైన శంకరరావును నిర్వాహకులు దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సప్ప అమ్మోజీ, నాయకులు సప్ప నవీన్, దడియాల నరసింహులు, బద్రి గోపాల్, ధర్మాన రమణ, యాళ్ల మనోహర్, నల్ల నారాయణరావు, మల్లా భవానీశంకర్ పాల్గొన్నారు.

రేషన్ డిపోల వద్ద బోర్డులు ఏర్పాటు

నందిగాం: ప్రతి రేషన్ డిపో వద్ద వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సోమేశ్వరరావు ఆదేశించారు. తన కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపోల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి స్టాక్ వివరాలు అందులో పొందుపర్చాలని సూచించారు. అలాగే ప్రతి నెల ఐదో తేదీలోగా బెడ్‌రిడిన్ లబ్ధిదారులకు రేషన్‌ను ఇంటికి వెళ్లి అందజేయాలని, డిపోల వద్ద బెంచీలు ఏర్పాటు చేయాలని, ధరల పట్టిక, స్టాక్‌వివరాలు నమోదు చేసి ప్రదర్శించాలని అన్నారు.

26న రోడ్డు కోసం పోరు యాత్ర ర్యాలీ

వజ్రపుకొత్తూరు: బెండిగేటు నుంచి వజ్రపుకొత్తూరు వెళ్లే రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల 26న బెండి గ్రామంలో చేపడుతున్న పోరు యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు కె.బాలాజీరావు, కె.హేమసూధనరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు కె.వెంకటరావు తెలిపారు. శనివారం వారు బెండిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..ర్యాలీలో ప్రజా సంఘాలు, గ్రామ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రహదారిని తవ్వేసి గోతులమయం చేయడం వల్ల ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పత్తా లేకుండా పోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు.